సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 14 : జూన్ : 2024



మరొకరి ప్రాణం నిలబెట్టండి

రక్తదానం చేయడం ఆరోగ్యకరమని, తద్వారా మరొకరి ప్రాణాలు కూడా కాపాడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. 8లో



బూబీట్రాప్స్ వెలికితీత

చర్ల మండలం పూసుగుప్ప శివారు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన 58 బూబీట్రాప్స్‌ను పోలీసులు గుర్తించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 26°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



విరాళం అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుదర్శన్, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం..

అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచకు చెందిన ఆడెపు గీత, స్వాతిక్ రూ.10 వేల విరాళం అందజేశారని ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. వారికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందించామని పేర్కొన్నారు.

ఇక విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

- ఈనెల 24 నుంచి ప్రతీ సోమవారం నిర్వహణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఈనెల 24 నుంచి సెలవు దినాల్లో మినహా ప్రతీ సోమవారం మండల పరిధిలో సెక్షన్ (ఏఈ) కార్యాలయం, సబ్ డివిజన్ పరిధిలో ఏడీఈ కార్యాలయం, డివిజన్ పరిధిలో డీఈ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఆయా కార్యాలయాల్లో నిర్వహించనుండగా, జిల్లా పరిధిలో సర్కిల్(ఎస్ఈ) కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు తమకు అందుబాటులో ఉన్న కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సర్కిల్ ఇన్‌చార్జ్ ఎస్ఈ బి.భీకంసింగ్ సూచించారు.

‘ఓపెన్’ ఫలితాలు విడుదల

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో గత ఏప్రిల్, మే నెల్లో నిర్వహించిన ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మద్దినేని పాపారావు, ఏసీజీఈ ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 790 మంది పరీక్ష రాయగా 255 మంది(32.28 శాతం), ఇంటర్‌లో 879 మందికి గాను 448 మంది(50.97 శాతం) ఉత్తీర్ణత సాధించారని వివరించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కావాలనుకునే వారు ఈనెల 18 నుంచి 27 వరకు వెబ్‌సైట్ లేదా మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీ కౌంటింగ్‌కు పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.350, ఇంటర్ వారికి రూ.400 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని, రీ వెరిఫికేషన్ అయితే పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1200 చొప్పున చెల్లించాలని తెలిపారు. ఫెయిల్ అయిన వారికి అక్టోబర్‌లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కిషన్‌రావు

మణుగూరు టౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ఇన్‌చార్జి ఆర్టీఓ, భద్రాచలం ఎంవీఐ తోట కిషన్‌రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు, పాఠశాలల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. విధి నిర్వహణలో మద్యం తాగకూడదని, ఫోన్ వినియోగించొద్దని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనల పాటించాలని సూచించారు. పాఠశాలల యజమానులు యూసఫ్ షరీఫ్, శ్రీనివాసరావు, థామస్ రెడ్డి, బస్సు డ్రైవర్లు ఉన్నారు.

సీతారామ.. ఇక స్పీడప్

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఖరీఫ్‌లో సాధ్యమైనంత మేరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి, ముగ్గురు మంత్రులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- ఆరు గంటల పాటు కలియదిరిగిన మంత్రులు
- అమ్మగారిపల్లి నుంచి పూసుగూడెం వరకు పరిశీలన
- ప్రాజెక్టు పనులపై సమీక్షించిన భట్టి, ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి
- ఆగస్టు 15 నాటికి గోదావరి నీరు పొలాలకు మళ్లించాలని ఆదేశాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి, తుమ్మల, కలెక్టర్ ప్రియాంక ఆల, ఎంపీలు, ఎమ్మెల్యేలు



పంపుహౌస్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

మంత్రుల పర్యటన ఇలా..

సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మిస్తున్న అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామానికి ఉదయం 11:30 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకున్నారు. ఆ తర్వాత హెలికాప్టర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ తర్వాత కాటన్ నిర్మించిన ఆనకట్ట, మధ్యలో ఆగిపోయిన బ్యారేజ్ పనులు, దిగువన హెడ్ రెగ్యులేటరీ పనులను పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ వెంట ప్రయాణిస్తూ బీజీ కొత్తూరులోని మొదటి పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మోటార్లు, నీటిని ఎత్తిపోసే పద్ధతుల గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కాల్వ పనులను పరిశీలిస్తూ ములకలపల్లి మండలం వీకే రామవరం – పూసుగూడెం గ్రామాల మధ్య ఉన్న రెండో పంప్‌హౌస్‌కు చేరుకున్నారు.

ప్రణాళికాయుతంగా పనులు చేయకనే..

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ ప్యాకేజీల్లో జరుగుతున్న పనులు, వాటి పురోగతి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రయత్నించారు. అయితే ఇప్పటివరకు ఎంత ఖర్చయింది, ఎన్ని ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించారంటూ మంత్రులు ఒక్కొక్కరుగా ప్రశ్నించారు. ఇప్పటి వరకు రూ.8వేల కోట్లు ఖర్చయినా, ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేదని ఇంజనీర్లు వివరించారు. ప్రణాళికాయుతంగా పనులు చేపట్టకపోవడం వల్లే భారీగా ఖర్చయినా ఇసుమంత ప్రయోజనం కూడా చేకూరలేదని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ ఖరీఫ్ సాగుకు నీరందాలి..

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భూములకు సాగునీరు అందేలా పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను మంత్రులు ఆదేశించారు. బీజీ కొత్తూరు, వీకే రామవరం, కమలాపురం వద్ద ఉన్న పంప్‌హౌస్‌ల్లో డ్రై రన్ నిర్వహించాలని ఇంజనీర్లకు సూచించారు. ప్రధాన కాల్వకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. దీంతో పాటు రూ.72 కోట్ల వ్యయంతో 9 కి.మీ. నిడివితో నిర్మిస్తున్న ఏన్కూరు లింక్ కెనాల్ పనులు యుద్ధప్రతిపాదికన చేపట్టి జూలై చివరి నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఈ మేరకు భూసేకరణ, టెండర్ల ప్రక్రియల్లో జాప్యం కాకుండా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా నాగార్జునసాగర్ కెనాల్ కింద ఉన్న 1.50 లక్షల ఎకరాలకు గోదావరి నీరు అందించాలని సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కనీసం 60 వేల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రయత్నించాలని చెప్పారు.

> **వేదిక దిగిన తుమ్మల**
>
> రాజీవ్‌సాగర్ రద్దు, సీతారామ ప్రాజెక్టు రీడిజైనింగ్‌పై చర్చ మొదలైన కాసేపటికే మంత్రి తుమ్మల వేదిక దిగి కిందకు వచ్చారు. అక్కడున్న వారితో కాసేపు మాట్లాడారు. తిరిగి వేదికను ఎక్కిన తర్వాత సాంకేతిక కారణాల వల్ల గత ప్రభుత్వం రీడిజైన్ చేసిందని చెప్పడం కొసమెరుపు.

పాలేరు టన్నెల్ పనులు ప్రారంభించాలి..

సీతారామ ప్రాజెక్టు సందర్శన అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో రద్దు చేసిన పాలేరు టన్నెల్ పనులు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు తిరిగి సిద్ధం చేయాలన్నారు. రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు రూ.2,554 కోట్లతో పూర్తయ్యేవని, అలాంటి దాన్ని సీతారామ రీ డిజైన్ పేరుతో గత ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లకు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. సీతారామ ద్వారా కొత్తగూడెం, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు నీరందించేలా ప్రయత్నిస్తామని చెప్పారు. సీతారామ సమీక్షకు సంబంధించి ఏర్పాట్లు బాగా లేవని ఇరిగేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గందరగోళంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1997 – 98లోనే దుమ్ముగూడెం ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని, వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ తెరపైకి వచ్చాయని తెలిపారు. ఆ సమయంలో మోటార్లు, పైపులు కొనుగోలు చేసినా భూసేకరణ చేయకపోవడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రధాన పనులను వదిలేసి, చివరి దశ పనులు ముందుగా పూర్తి చేసిందని, అందుకే భారీగా ఖర్చయినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. వచ్చే జూలై 31 నాటికే సీతారామ ద్వారా గోదావరి నీళ్లు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుతో జిల్లాకు అన్యాయం జరుగుతోందని, ఇక్కడ ఆయకట్టు చాలా తక్కువగా ఉందని అన్నారు. గోదావరి పక్కనే ఉన్నా పినపాక, భద్రాచలం నియోజకవర్గాలకు చుక్క నీరు అందడం లేదని, అవసరమైతే కొత్త ఎత్తిపోతలు చేపట్టి ఈ నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని కోరారు. సమావేశంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

> **ఊసేలేని ఇల్లెందు**
>
> సీతారామ ప్రాజెక్టు సమీక్షలో ఇల్లెందు నియోజకవర్గం ఊసే లేకుండా పోయింది. వ్యక్తిగత కారణాలతో అక్కడి ఎమ్మెల్యే కోరం కనకయ్య సమీక్షకు హాజరు కాలేదు. దీంతో నియోజకవర్గ సమస్యలు ఎవరూ లేవనెత్తలేదు. ప్రారంభంలో సీతారామ ప్రాజెక్టుకు ఈ నియోజకవర్గంలోని రోళ్లపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (10 టీఎంసీలు) కీలకం. జిల్లాలోనే ఎత్తయిన ప్రదేశం కావడంతో ఇక్కడి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించే వీలుండేది. అయితే వన్యప్రాణి అభయారణ్యం నుంచి అనుమతులు కష్టమనే కారణంతో రీ డిజైన్ చేశారు. దీంతో సీతారామ నుంచి ఇల్లెందు మొత్తం మాయమైంది. ఆ తర్వాత ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ అంశాలేవీ సమీక్షలో చర్చకు రాలేదు.

కలెక్టర్ స్వాగతం



మంత్రులు ఉత్తమ్, పొంగులేటికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

అశ్వాపురం: అశ్వాపురం మండల పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులకు కలెక్టర్ ప్రియాంక ఆల స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యాయవాది నిత్య విద్యార్థి..

- నిరంతరం చట్టాలను చదువుతూ ఉండాలి
- జిల్లా జడ్జి పాటిల్ వసంత్ సూచన



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులు నిత్య విద్యార్థులని, జీవిత కాలమంతా చట్టాలను చదువుతూ అర్థం చేసుకోవాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, జడ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులు చట్టాలను అధ్యయనం చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ.. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం చట్టాలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానున్నాయని, ముఖ్యమైన ఈ చట్టాలపై ఇప్పటికే 60 మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ సెక్రటరీ రవిచంద్ర, లైబ్రరీ సెక్రటరీ ఎండీ సాధిక్‌పాషా, న్యాయవాదులు గాజుల రామ్మూర్తి, వట్టికొండ వెంకట సుధాకర్‌రావు, జి. రామచంద్రారెడ్డి, మెండు రాజమల్లు, అత్తులూరి మనోరమ, ఆడపాల మహాలక్ష్మి, కె.నాగేశ్వరావు, దొడ్డా సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలు గుర్తించాం

డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం జాబితా రూపొందించామని పేర్కొన్నారు. జిల్లాలో లోకల్‌బాడీ యాజమాన్యంలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు 75, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 54, ఎస్‌ఏ తెలుగు 194, హిందీ 162, ఇంగ్లిష్ 23, గణితం 47, ఫిజికల్ సైన్స్ 18, బయోసైన్స్ 52, సోషల్ 83, స్పెషల్ ఎడ్యుకేషన్ 1 పోస్టు ఖాళీలు ఉన్నాయని వివరించారు. వాటిని పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారని పేర్కొన్నారు. ఇక ప్రభుత్వ యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 6, తెలుగు 11, హిందీ 8, ఆంగ్లం 3, గణితం 4, ఫిజికల్ సైన్స్ 1, బయోసైన్స్ 7, సోషల్ 7 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వీటిని కూడా పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారని తెలిపారు. రెండు యాజమాన్యాల పరిధిలో అన్ని కేటగిరీల్లో మొత్తం 756 మంది ఉపాధ్యాయ పోస్టులు పదోన్నతులు ద్వారా భర్తీ అవుతాయని, అర్హులైన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పూర్తి పారదర్శకతతో తయారు చేశామని వెల్లడించారు.

డీసీసీబీ భేటీలో మళ్లీ అదే తీరు

- అజెండాలోని అంశాలపై విభేదించిన మెజారిటీ డైరెక్టర్లు
- నూతన చైర్మన్ సహా ఇంకొన్ని చేర్చాలని డిమాండ్



సమావేశం నుంచి బయటకు వచ్చిన డైరెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పాలకవర్గ సమావేశానికి రూపొందించిన అజెండాను మెజారిటీ డైరెక్టర్లు తిరస్కరించారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి చైర్మన్, డైరెక్టర్లు హాజరయ్యారు. చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని ప్రారంభించగా.. సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ అజెండాను వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే డైరెక్టర్లు కలగచేసుకుని గడిచిన రెండు సమావేశాల్లో తాము పేర్కొన్న అంశాలను అజెండాలో చేర్చనందున తిరస్కరిస్తున్నామని తెలిపారు. అంతేకాక తాము చెబుతున్న అంశాలను రిజిస్టర్‌లో రాసి అజెండాలో చేరిస్తేనే సమావేశంలో పాల్గొంటామని చెప్పి బయటకు వచ్చేశారు.

చైర్మన్ ఎన్నికకు పట్టు

పాలకవర్గ సమావేశం నుంచి బయటకు వచ్చిన పది మంది డైరెక్టర్లు మీడియాతో మాట్లాడారు. నూతన చైర్మన్ ఎన్నికతో పాటు మరో మూడు అంశాలను అజెండాలో చేర్చాకే సమావేశం నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. గత చైర్మన్‌పై అనర్హత వేటు పడ్డాక వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావును తాత్కాలికంగా నియమించగా, మార్చి 15 నాటి పాలకవర్గ సమావేశంలో నూతన చైర్మన్ ఎన్నికపై తీర్మానం చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత ఇంకో రెండు సమావేశాల్లో ఇలాగే జరగగా, ఈ నెల 6వ తేదీ నాటి సమావేశాన్ని బహిష్కరించామని వివరించారు. చైర్మన్ సహా ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ల ఎన్నిక, ఎన్నికల కోడ్ ఉన్న సమయాన జరిగిన ఉద్యోగుల బదిలీపై సమీక్ష, పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారికి చెల్లించిన రూ.78 లక్షల ఎరియర్స్‌పై చర్చించేలా అజెండాలో చేర్చాలని డైరెక్టర్లు జనగం కోటేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, లక్కినేని సురేందర్ రావు, బొర్రా రాజశేఖర్, మేకల మల్లిబాబుయాదవ్, బోబోలు లక్ష్మణ్ రావు, నూకల సైదులు, అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, చావా వేణుగోపాలకృష్ణ, మోదుగు పుల్లారావు డిమాండ్ చేశారు. కాగా, డైరెక్టర్లు సమావేశం నుంచి బయటకువచ్చాక కార్యాలయ ఆవరణలోని గెస్ట్‌హౌస్‌కు తాళం వేసి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళం తీయాలని సూచించినా సిబ్బంది తమ వద్ద తాళం లేదని చెప్పడంతో పగలగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోనే చైర్మన్ వెంకటేశ్వరరావు రాగానే తాళం తీయడంతో ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తుండగా కాసేపు వాగ్వాదం జరిగింది.

పత్తి సాగుకే సై..



పత్తి సాగుకు దుక్కి దున్నుతున్న రైతు



పత్తి గింజలు నాటుతున్న కూలీలు

- అపరాలపై రైతుల అనాసక్తి
- మార్కెట్‌లో పప్పులకు డిమాండ్
- అయినా సాగుకు ముందుకు రాని వైనం
- అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ విఫలం

బూర్గంపాడు: ఈ ఏడాది కూడా జిల్లా రైతులు పత్తి సాగుకే మొగ్గ చూపుతున్నారు. దిగుబడి తగ్గి.. గిట్టుబాటు ధర లభించకున్నా పత్తి సాగును మాత్రం వదలడం లేదు. గతేడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల మేర మాత్రమే పంట పండింది. అకాల వర్షాలతో పత్తి నల్లబడడం, నాణ్యత దెబ్బతినడంతో గిట్టుబాటు ధర కూడా దక్కలేదు. ప్రైవేటు వ్యాపారుల కంటే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ధర ఎక్కువగా లభించినా జిల్లాలో నాలుగు కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో రైతులు పత్తి విక్రయానికి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ కేంద్రాల్లోనూ రవాణా, హమాలీ చార్జీలు రైతులకు అదనపు భారంగా మారాయి. గతేడాది ఇన్ని ఇబ్బందులు పడినా.. మళ్లీ ఈ సంవత్సరం కూడా రైతులు పత్తిసాగుకే ప్రాధాన్యత ఇస్తుండడం గమనార్హం. జిల్లాలో సుమారు 1.76 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఇందులో 95 శాతం మేర వర్షాధారంగానే పండిస్తున్నారు. నీటి పారుదల అవకాశాలున్న భూముల్లో వరి, కూరగాయలు, పామాయిల్, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. మెట్టభూముల్లో అగ్రభాగం పత్తి పంటే వేస్తున్నారు.

తగ్గనున్న మిర్చి సాగు..

గతేడాది జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. అయితే నల్లి, తామర వంటి చీడపీడలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు ఆశించిన ధరలు కూడా రాలేదు. దీంతో ఈ ఏడాది మిరప సాగు తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పు గింజలకు బాగా డిమాండ్ ఉంది. గత ఐదారేళ్లుగా కంది, మినుము, పెసర, శనగ, బొబ్బర వంటి పప్పు గింజలకు ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో పప్పు గింజల ధరలు క్వింటాకు రూ.10వేల వరకు పలుకుతోంది. అయితే మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా పప్పు ధాన్యాల సాగుకు రైతులు మాత్రం ముందుకు రావడం లేదు. ప్రతి యేటా అపరాల సాగు తగ్గుతూ వస్తోంది. కంది, మినుము, పెసర, అలసంద వంటి పంటలకు జిల్లా భూములు అనుకూలమే అయినా వాణిజ్య పంటల సాగుకు అలవాటు పడిన రైతులు సంప్రదాయ అపరాల సాగుకు విముఖత చూపుతున్నారు. జిల్లాలో అన్ని రకాల అపరాల సాగు కలిపి పదివేల ఎకరాల లోపే కావడం గమనార్హం. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మిగతా వాణిజ్య పంటలతో పోల్చితే అపరాల సాగుకు పెట్టుబడి సగానికి పైగా తగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో రైతులను చైతన్యం చేయాల్సిన వ్యవసాయ శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. పొరుగున ఉన్న ఏపీలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు పత్తి సాగు గణనీయంగా తగ్గించి అపరాల పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు 10 క్వింటాళ్ల మేర దిగుబడి సాధిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

25 ఏళ్లుగా పత్తే వేస్తున్నాం



గత ఇరవై ఐదేళ్లుగా పత్తి పండిస్తున్నాం. దీంతో ఆ పంట సాగే అలవాటయింది. అంతకుముందు కంది, పెసర, మినుము పండించే వాళ్లం. అప్పట్లో ఈ పంటలకు గిట్టుబాటు ధరలు లేక సాగు మానేశాం. ఇప్పుడు వాటికి పత్తికంటే ఎక్కువగా ధరలున్నాయి. అయితే పత్తి సాగుకే అలవాటైన మేము ఇతర పంటలు వేయడం లేదు. పప్పు దినుసులు సాగు చేయాలంటే వాటిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సీసీఐ మాదిరి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– నిమ్మల రాములు, బూర్గంపాడు

అవగాహన కల్పిస్తున్నాం



అపరాలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వాణిజ్య పంటల సాగుకు అలవాటైన రైతులు ఇప్పుడిప్పుడే అపరాల సాగుకు ముందుకొస్తున్నారు. ప్రస్తుతం పప్పు దినుసుల పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాంటి పంటలు సాగు చేస్తేనే రైతులు లాభాలు పొందే అవకాశాలున్నాయి. అపరాల సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– బి. తాతారావు, ఏడీఏ, మణుగూరు

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన శాఖ అధికారి వేల్పుల విజేత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అపోలో ఫార్మసీలో 100 ఫార్మసిస్ట్ పోస్టులు, 100 ట్రెయినీ ఫార్మసిస్ట్ పోస్టులు ఉన్నాయని, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్‌లకు వేతనం రూ.16,300 నుంచి రూ.25వేల వరకు, ట్రెయినీ ఫార్మసిస్ట్‌లకు రూ.14,800 నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని వివరించారు. సాయి అంజనా మోటార్స్‌లో మార్కెటింగ్ టీమ్ లీడర్ మూడు, మెకానిక్ ఆరు పోస్టులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 10 ఉన్నాయని, టీమ్ లీడర్లకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, మెకానిక్‌లకు రూ.10 వేల నుంచి రూ.12 వేలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుందని తెలిపారు. హైదరాబాద్, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయని వివరించారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగులు గమనించాలని సూచించారు.

క్లుప్తంగా

గృహ రుణాలపై ఆంక్షలు ఎత్తివేత

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల గృహ రుణాలపై గతంలో ఉన్న ఆంక్షలను ఎత్తివేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉద్యోగ విరమణకు ఒక ఏడాది మాత్రమే గడువు ఉన్నా, ఉద్యోగంలో చేరి ఏడాది పూర్తి కాకున్నా గృహ రుణాలు ఇచ్చేవారు కాదు. దీంతో చాలా మంది కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవానికి యాజమాన్యమే కార్మికులకు ఇళ్లు నిర్మించాల్సి ఇవ్వాలి. తీసుకున్న రుణానికి వడ్డీ సంస్థ నుంచే చెల్లించాలి. కానీ అలా చేయకపోవడంతో కార్మికులే సొంతంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్నారు. అయితే 8.33 శాతం మేర వడ్డీకి తీసుకున్న వారికి 6 లేదా 7 శాతమే యాజమాన్యం చెల్లించేది. ఈ సమస్యలన్నింటినీ సింగరేణి డైరెక్టర్(పా), ఫైనాన్స్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన యాజమాన్యం ఆంక్షలన్నీ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుందని గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.28.01లక్షలు



పర్ణశాలలో బ్యాంకు అధికారులకు నగదు అప్పగిస్తున్న ఈఓ రమాదేవి

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ జి.సుదర్శన్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా 91 రోజులకు గాను రూ.28,01,520 నగదుతో పాటు విదేశీ కరెన్సీ, మిశ్రమ వెండి, బంగారం లభించాయి. ఈ కార్యక్రమంలో కరూర్‌వైశ్య బ్యాంక్ మేనేజర్ పి.మదన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాల ఆదాయం రూ.17.19లక్షలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవస్థానం ఈఓ రమాదేవి పర్యవేక్షణలో సిబ్బంది లెక్కింపు చేపట్టగా 147 రోజులకు గాను రూ.17,19,292 ఆదాయం నమోదైంది. అలాగే, విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు ఈఓ తెలిపారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, ఉద్యోగులు నిరంజన్, కత్తి శ్రీనివాస్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక మేటల పరిశీలన



కోతకు గురైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం: మండల కేంద్రంలోని పెద్దవాగులో గల ఇసుక మేటలు, బ్రిడ్జిని జిల్లా మైన్స్ ఏడీ నిరంజన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వానాకాలంలో వరద నీటికి చిరుమళ్ల బ్రిడ్జి ఇరువైపులా కోతకు గురైందని, పొలాలు కొట్టుకుపోయాయని, స్థానిక ప్రజలు సైతం తీవ్రంగా ఇబ్బంది పడ్డారని తెలిపారు. అయితే అందుకు కారణాలు తెలుసుకోవాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారని, ఈ మేరకు తాము పరిశీలనకు వచ్చామని వివరించారు. పరిశీలన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బి.రమేష్ బాబు, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఏఈఈ బి.సక్కు, ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ కట్టుగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గురువారం బావిలో పడి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సున్న శ్రీనివాస్ (56) గేదెలు రెండు రోజులుగా కనిపించడంలేదు. దీంతో గ్రామ శివారులో వెతుకుతుండగా ఓ పాడుబడ్డ బావిలో గేదె మృతి చెంది కనిపించింది. మృతి చెందిన గేదె తనదో.. కాదోనని తొంగి చూస్తుండగా కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

విషజ్వరంతో విద్యార్థిని...



ప్రవళిక (ఫైల్)

పాల్వంచరూరల్: పది రోజులుగా విషజ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రేగులగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే అలెం రాంబాబు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె అలెం ప్రవళిక (15) పడమటి నర్సాపురంలో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతోంది. పది రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతుండగా, పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

మరొకరి ప్రాణం నిలబెట్టండి

- రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలి
- అపోహలు వీడి ముందుకురావాలని వైద్యుల సూచన
- బాధితులకు అండగా పలు బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్లు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న దాతలు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడవచ్చు. కానీ అపోహలతో కొందరు రక్తదానానికి ముందుకు రావడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. వీటిని తొలగించేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహిస్తున్నారు. రక్తదానంపై అవగాహన పెంపొందిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఎనిమిది ప్రధాన ప్రజాఆరోగ్య కార్యక్రమాల్లో రక్తదాతల దినోత్సవం ఒకటిగా గుర్తించారు.

మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చు..

సాధారణంగా రోడ్డు ప్రమాదాలు, తలసేమియా, కేన్సర్, ప్రసవం, శస్త్రచికిత్సల సమయంలో రక్తం చాలా అవసరం. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో తలసేమియా బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆపదవేళ రక్త లభ్యత సవాలుగా మారుతోంది. 18 నుంచి 65 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయవచ్చని, మూడు నెలలకోసారి రక్తం ఇవ్వడం మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఒక వ్యక్తి జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చని, రక్తదానం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూచిస్తున్నారు. 15 రోజులకోసారి ప్లేట్‌లెట్లు ఇవ్వొచ్చని, రక్తదాతలు ఎర్రరక్త కణాలతో రక్తహీనత రోగిని, ప్లాస్మాతో ఒకరిని, ప్లేట్‌లెట్లతో మరొకరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని వివరిస్తున్నారు. రక్తదానం చేసినప్పుడు ఏర్పడిన నష్టం 4 నుంచి 8 రోజుల్లో భర్తీ అవుతుందని పేర్కొంటున్నారు.

సామాజిక మాధ్యమాల ద్వారా..

కొందరు సామాజిక బాధ్యతగా రక్తదానం చేస్తూ పలువురితో చేయిస్తూ ముందుకు సాగుతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా బ్లడ్ డొనేషన్ ఆర్గనైజేషన్లను నడుపుతున్నారు. భద్రాచలం పట్టణంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారు రక్తం అవసరమైతే ఆర్గనైజర్లను సంప్రదిస్తుండగా, వారు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. దీంతో పలువురు యువకులు ముందుకొచ్చి రక్తదానం చేస్తున్నారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ వద్ద కూడా దాతల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుతున్నారు.

అరుదైన గ్రూపులు..

అరుదైన బ్లడ్ గ్రూపులైన ఓ నెగిటివ్, బీ నెగిటివ్, ఏబీ పాజిటివ్ రక్తం కలిగినవారిని గుర్తించి ఆర్గనైజర్లు ఆయా గ్రూపుల్లో చేర్చారు. వారికి అవగాహన పెంపొందిస్తూ రక్తదానం చేసేలా కృషి చేస్తున్నారు. పట్టణానికి చెందిన మహమ్మద్ జిందా 2000 సంవత్సరం నుంచి జిందా బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్నాడు. 'ఓ' నెగెటివ్ గ్రూపు కలిగిన తాను ఇప్పటివరకు 65 సార్లు రక్తదానం చేశానని, మరో 3 వేల మందితో రక్తదానం చేయించానని చెబుతున్నాడు. ఇలాగా మరో ఐదారు గ్రూపులు రక్తదానం చేయిస్తున్నాయి.

భద్రాచలంలోని కొన్ని బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్లు..

జిందా బ్లడ్ డోనార్ ఆర్గనైజేషన్	మహమ్మద్ జిందా	94405 24858
మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్	కొప్పుల మురళి	70758 22801
పృథ్వీ సేవా ఫౌండేషన్	పృథ్వీ యాదవ్ బొల్లి	95531 35331
జీసీఎం బ్లడ్ డోనార్స్ క్లబ్	గాడి విజయ్	99668 61434
యంగ్ బాయ్స్	మల్లెల లోకేష్	91778 81010

30 సార్లు రక్తదానం చేశా..



నా బ్లడ్ గ్రూప్ ఏబీ పాజిటివ్. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ ఆర్గనైజర్ మురళి ప్రోత్సాహంతో 2010లో తొలిసారిగా రక్తం ఇచ్చాను. ఇప్పటివరకు 30సార్లు రక్తదానం చేశాను. వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన సమాచారం ఆధారంగా మరికొందరితో రక్తదానం చేయిస్తున్నాను.

–నవీన్‌కుమార్, న్యాయవాది, భద్రాచలం

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ప్రమాదాలు, కాన్పు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అవసరం ఉంటుంది. ముఖ్యంగా ఏజెన్సీలో రక్తం అవసరమైన బాధితులు ఎక్కువమంది ఉంటారు. అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్నవారు వీలైనంత ఎక్కువమంది రక్తదానం చేయాలి. రక్తదానంతో మరొకరి ప్రాణం కాపాడినవారు అవుతారు.

–డాక్టర్ ఎం.రామకృష్ణ, భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

1.93 క్వింటాళ్ల గంజాయి సీజ్

నిందితులు అరెస్ట్, కారు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: జిల్లాలో గురువారం రెండు ఘటనల్లో 1.93 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేశారు. కారులో అక్రమంగా 1.86 కేజీల గంజాయి తరలిస్తుండగా కొత్తగూడెంలో పట్టుకున్నారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ కథనం ప్రకారం.. ఎస్సై విజయ సిబ్బందితో కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారులో వస్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని విచారించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన పెనుగొండ నర్సింహులు, కుంచం లక్ష్మణ్, భూక్య లక్ష్మణ్ ఒడిశాలోని మల్కన్‌గిరిలో 1.86 క్వింటాళ్ల గంజాయి కొనుగోలు చేసి కారులో భద్రాచలం మీదుగా మహారాష్ట్రలోని షోలాపూర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.75 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు.

భద్రాచలంలో 7 కేజీలు..

భద్రాచలంఅర్బన్: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన రేకుల సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కొలనూర్‌కు చెందిన ఏకుల సజన్ కుమార్ వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్లు. వీరిద్దరూ కలిసి సాయికుమార్ స్నేహితుడు మండల కుమార్ బైక్ తీసుకుని ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు వెళ్లారు. అక్కడ 7.3 కేజీల గంజాయిని కొనుగోలు చేసుకుని వస్తుండగా, భద్రాచలం పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయిని, బైక్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన గంజాయి రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

నాటు సారా..

మరో కేసులో ఆటోలో తరలిస్తున్న 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్, భద్రాచలం ఎక్సైజ్ ఎస్‌ఐ సీతారామరాజు, సాయిరామ్ పాల్గొన్నారు.

సారా విక్రేతల బైండోవర్

దుమ్ముగూడెం : మండలంలోని రేగుంట, చిన్ననల్లబల్లి, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన నలుగురు నాటుసారా విక్రేతలను తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట ఎక్సైజ్ అధికారులు గురువారం బైండోవర్ చేశారు. గతంలో కూడా నాటుసారా విక్రయించిన ఘటనలో వీరిపై కేసులు నమోదు కావడంతో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబల్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత..

మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో బుధవారం రాత్రి నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్, మొద్దులగూడెం గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, కాపర్ వైర్ అపహరించారు. గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లిన రైతులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ ఎస్.సతీష్ కుమార్ వచ్చి పరిశీలించారు. రూ.80 వేల విలువైన కాపర్ వైర్ చోరీ చేశారని, ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని ఏఈ తెలిపారు.

కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దొంతికుంటకు చెందిన బేతి నాగేంద్రరావు, ఎం.చిలకయ్య కాలినడకన వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి సైకిల్‌పై వచ్చిన అశ్వారావుపేటకు చెందిన పుట్టి అభిరామ్ అనే వ్యక్తి పాతకక్షల నేపథ్యంలో రాయితో దాడికి పాల్పడ్డాడు. దీంతో నాగేంద్రరావు కంటి భాగంలో గాయమైంది. దుర్భాషలాడి, చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

పాల్వంచ: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం పూసుగూడేనికి చెందిన గుగులోతు వెంకటేశ్ (30)కు గౌరీతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే వీరికి పిల్లలు లేరు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల భర్తతో గొడవ పడి గౌరీ పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేశ్ గురువారం పాల్వంచ అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ వైన్ షాపు వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి తండ్రి దస్రుకు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెం తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి దస్రు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా బూబీట్రాప్స్ వెలికితీత

58 బూబీట్రాప్స్ నుంచి 3,350 ఇనుప చువ్వలను తీసిన బలగాలు



బూబీట్రాప్స్‌ను తొలగిస్తున్న పోలీసులు

చర్ల: మండలంలోని పూసుగుప్పలో పోలీసులు గురువారం భారీ సంఖ్యలో బూబీట్రాప్స్‌ను వెలికితీశారు. పూసుగుప్ప శివారు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటుచేసిన 58 బూబీట్రాప్స్‌ను గుర్తించిన చర్ల పోలీసులు, పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ సిబ్బంది వాటిని తొలగించారు. ఈనెల 10వ తేదీన ఇదే ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన 70 బూబీట్రాప్స్ నుంచి 4,396 పదునైన ఇనుప చువ్వలను వెలికి తీయగా, గురువారం 58 బూబీట్రాప్స్ నుంచి 3,350 ఇనుప చువ్వలను వెలికి తీశారు. ఈ క్రమంలో సరిహద్దు అటవీ ప్రాంతాల్లో ఇలాంటివి మరిన్ని ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై సమీప ఆదివాసీ గ్రామాల గిరిజనులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండడంతో ఎస్పీ రోహిత్‌రాజ్, సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా, సరిహద్దు ప్రాంతాల ఆదివాసీలు, గిరిజనులు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసు ఉన్నతాధికారులు కోరారు.

రేషన్ బియ్యం సీజ్

మణుగూరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మున్సిపాలిటీ పరిధిలో గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజేశ్ కథనం ప్రకారం.. అశ్వాపురం మండలం మల్లెలమడుగుకు చెందిన దాసరి రాము, మొండికుంటకు చెంది పడిగ శ్రీను, జగ్గారానికి చెందిన బోడిపూడి సతీష్‌లు టాటా మ్యాజిక్ వాహనంలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శివలింగాపురం నుంచి చింతూరుకు తరలిస్తున్నారు. అదే సమయంలో హనుమాన్ ఆలయం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూలూరుపాడులో 12 క్వింటాళ్లు..

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు రెవెన్యూ జడలచింత గ్రామానికి చెందిన రామారావు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించి 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారుల ద్వారా జూలూరుపాడు రేషన్ డీలర్‌కు అప్పగించి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జీవన్ రాజు తెలిపారు.

దుమ్ముగూడెంలో 10 క్వింటాళ్లు..

దుమ్ముగూడెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కేశవరావు కథనం ప్రకారం.. ఆటోలో ఇద్దరు వ్యక్తులు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకెళ్తుండగా వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అదుపులో తీసుకుని విచారించగా ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కూటురు గ్రామానికి చెందిన గుడివాడ గంగాధర్, సున్నం విజయ్‌లుగా తేలింది. వీరు వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన అస్కర్ అనే వ్యక్తికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ తెలిపారు.

తెలుగు పుస్తకాలు వెనక్కి..



ఎనిమిదో తరగతి తెలుగు వాచకం

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/పాల్వంచ రూరల్/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో 1నుంచి 10వ తరగతి వరకు తెలుగు పుస్తకాల మొదటి పేజీ(ముందు మాట)లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అని విద్యాశాఖ మంత్రులు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి అంటూ పాత పేర్లే ముద్రితమయ్యాయి. ఈ అంశాన్ని బుధవారమే గుర్తించినా ఆ పేజీ తొలగించి సరఫరా చేయాలని తొలుత సూచించారు. అయితే, గురువారం ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవడంతో పాటు మిగతా వాటి పంపిణీని నిలిపేయాలని ఆదేశాలు రావడంతో ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ ఎంఈఓలకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయా పుస్తకాలను మండల రిసోర్స్ సెంటర్(ఎంఆర్‌సీ)లో భద్రపరుస్తున్నారు. జిల్లాలో 80వేలకు పైచిలుకు తెలుగు పాఠ్యపుస్తకాలకు గాను 26వేల పుస్తకాలను తొలిరోజు పంపిణీ చేయగా వాటిని వెనక్కి తీసుకుంటున్నారు. తెలుగు మినహా మిగతా పుస్తకాలను యథావిధిగానే పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, పాల్వంచ, నేలకొండపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన, పంపిణీ చేయకుండా పాఠశాలల్లో మిగిలిన తెలుగు వాచకం పుస్తకాలను వెనక్కి తీసుకుంటున్నట్లుట్లు ఎంఈఓలు శ్రీరామ్మూర్తి, బి.రాములు, ఎం.శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు.

వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర సందర్శన



కంపెనీ వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం క్షేత్ర సందర్శన చేశారు. అగ్రి బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అశ్వారావుపేటలోని ఆయిల్‌ఫెడ్ ప్రొడ్యూసర్ కంపెనీ కేంద్రాన్ని సందర్శించగా, కంపెనీ ఇన్‌చార్జి నాగరాజు సంస్థ ప్రాముఖ్యత, సంస్థాగత నిర్మాణంపై వివరించారు. వ్యవసాయ పద్ధతులు, యంత్రాలు పని చేసే విధానం, రైతులకు కలిగి ప్రయోజనం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్థికశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణతేజ, విస్తరణ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభించకముందే బుంగలు



ప్రాజెక్టు కాల్వలో మొలిచిన మొక్కలు, (ఇన్‌సెట్) ప్రాజెక్టు కాల్వకు పడిన బుంగ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. అయితే, ప్రాజెక్టు ప్రారంభానికి ముందే పలు ప్రాంతాల్లో కాల్వలు దెబ్బతింటున్నాయి. ఈ ప్రాజెక్టు కాల్వకు ములకలపల్లి మండలం వీ.కే.రామవరం(పూసుగూడెం) వద్ద బుంగలు పడ్డాయి. అంతేకాక కొన్నిచోట్ల చెట్లు మొలిచాయి. ఇక్కడ పడిన బుంగ పెద్దగా ఉండడంతో వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

పెళ్లికి వెళ్లి తిరిగొస్తుండగా..

- ట్రాక్టర్ బోల్తా : ఒకరు మృతి
- మరో 14 మందికి గాయాలు
- మృతురాలు, క్షతగాత్రులు ఛత్తీస్‌గఢ్ వాసులు



మడకం బండి మృతదేహం



బోల్తాపడ్డ ట్రాక్టర్



ఆస్పత్రిలో చికిత్స పొందిన క్షతగాత్రులు

పాల్వంచరూరల్: పెళ్లికి వెళ్లి తిరిగొస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు బోల్తా పడింది. దీంతో ఓ మహిళ మృతి చెందగా, మరో 14 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మొండికట్ట సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా తొండమర్క గ్రామానికి చెందిన 15 మంది ఆదివాసీ గిరిజనులు గురువారం ట్రాక్టర్‌లో ఆళ్లపల్లి మండలం సింగారం గ్రామంలో వివాహానికి హాజరయ్యారు. తిరిగి వస్తున్న క్రమంలో పాల్వంచ మండలం మొండికట్ట గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజన్ రోడ్డు మీద ఉంటే ట్రక్కు రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. దీంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 15 మంది కిందపడి గాయపడ్డారు. వీరిలో మడివి బండి(35) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మడివి మోయా అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురు చిన్నారులు సహా మరో 13 మందికి స్వల్పంగా గాయపడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 ద్వారా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంతో ట్రాక్టర్ నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ హరీష్ (మోయా)పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.